సాక్షి రంగారెడ్డి

ఆదివారం ı 30 ı జూన్ ı 2024



'ఆయిల్ పామ్'తో లాభాలు

ఆయిల్ పామ్ సాగుతో ఎక్కువ లాభాలు గడించవచ్చని ఆయిల్‌పామ్ రాష్ట్ర సలహాదారుడు డాక్టర్ బీఎన్ రావు అన్నారు. 8లో▸



సహజయోగా మహోత్సవం

యోగాతో సంపూర్ణ ఎదుగుదల సాధ్యమని సహజ యోగ నేషనల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ సోనాలి భట్టాచార్య అన్నారు. 8లో▸



రుణమాఫీకి ఆంక్షలుండొద్దు

రుణమాఫీకి ఆంక్షలు విధించొద్దని మాజీ ఎమ్మెల్యేలు బాలరాజు, రాజేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్: హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పశ్చిమ ప్రాంతంలోని 17 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో తాత్కాలిక పద్ధతిలో అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయాధికారి శారద శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రం, జంతు శాస్త్రం, వృక్ష శాస్త్రం, అర్థ శాస్త్రం, పౌరశాస్త్రం బోధించేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా లైబ్రేరియన్, పీఈటీ, హెల్త్ సూపర్‌వైజర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు జూలై 3న ఉదయం 9 గంటలకు మొయినాబాద్ మండలంలోని చిలుకూరు గురుకులంలో జరిగే డెమోకు సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. అభ్యర్థులు పీజీ, బీఈడీ, జీఎస్‌ఎం, బీపీఈడీ, బీఎల్ఐసీ అర్హతలు కలిగి ఉండాలన్నారు. ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు.

రుణమాఫీతో రైతులకు న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న టెస్కాబ్ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య

తుర్కయంజాల్: రుణమాఫీతో రాష్ట్రంలోని అనేక మంది రైతులకు న్యాయం చేకూరనుందని టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ, తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో అమలు చేయనున్న రైతు భరోసా కార్యక్రమంపై రైతుల సలహాలు, సూచనలు స్వీకరించేందుకు శనివారం తుర్కయంజాల్‌లోని సంఘం కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ.. రుణమాఫీ అంశంలో ప్రభుత్వం రైతుల నుంచి సలహాలు స్వీకరించనుందని తెలిపారు.

జిల్లా అభివృద్ధే లక్ష్యం

జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి



లేమూరులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

కందుకూరు: జిల్లా అభివృద్ధే లక్ష్యంగా తన శాయశక్తులా పని చేశానని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని లేమూరు, కందుకూరు, పులిమామిడి, ధన్నారం గ్రామాల్లో రూ.77.79 లక్షల నిధులతో భూగర్భ డ్రైనేజీ, సీసీ రహదారుల నిర్మాణాలకు శనివారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రాధాన్యతా క్రమంలో నిధులను ఆయా మండలాలు, గ్రామాలకు కేటాయించినట్టు తెలిపారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలను పక్కన పెట్టి అందరూ కలిసిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మంద జ్యోతి, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, వైస్ ఎంపీపీ జి.శమంత, ఎంపీటీసీలు రాజమ్మ, రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సరికొండ మల్లేష్, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్, మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాణాప్రతాప్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కె.పాండురంగారెడ్డి, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

ఖర్గేను కలిసిన కాలె



చేవెళ్ల: బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశారు. శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో కలిసి ఖర్గేను మర్యాదపూర్వకంగా కలిశారు. వారివెంట తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఎ.చంద్రశేఖర్, పార్టీ నాయకులు సంపత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

గ్రీన్‌సిగ్నల్

లాంగ్ స్టాండింగ్ (8 ఏళ్లు) వెకెన్సీ పొజిషన్

కేడర్	ఖాళీలు
సోషల్ స్టడీస్, ఎస్ఏ	91
తెలుగు, ఎస్ఏ	59
ఫిజికల్ సైన్స్, ఎస్ఏ	85
మ్యాథమెటిక్స్, ఎస్ఏ	47
ఇంగ్లిష్, ఎస్ఏ	67
హిందీ, ఎస్ఏ	30
బయాలాజికల్ సైన్స్, ఎస్ఏ	58
ఫిజికల్ ఎడ్యుకేషన్స్, ఎస్ఏ	06
క్రాఫ్ట్ టీచర్స్, ఎస్ఏ	06
ఆర్ట్ అండ్ డ్రాయింగ్, ఎస్ఏ	01



కోర్టు ఉత్తర్వులతో టీచర్ల బదిలీల్లో కదలిక

- జిల్లా వ్యాప్తంగా 3,500 మందికి స్థాన చలనం
- మరో 700 మందికి పదోన్నతులు లభించే అవకాశం
- జూలై 5వ తేదీలోగా ప్రక్రియ పూర్తికి ఆదేశం
- అర్హుల జాబితాను సిద్ధం చేసే పనిలో జిల్లా విద్యాశాఖ అధికారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు రంగం సిద్ధమైంది. కోర్టుకేసు కారణంగా కొంతకాలంగా వాయిదా పడుతూ వస్తున్న ఈ ప్రక్రియకు ఎట్టకేలకు గ్రీన్‌సిగ్నల్ లభించడంతో అధికారులు ఆయా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల జాబితాను తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. దీర్ఘకాలంగా ఒకే చోట పని చేస్తున్న 3,500 మందికిపైగా ఉపాధ్యాయులకు స్థాన చలనం కల్పించడంతో పాటు సీనియార్టీ ఆధారంగా 700 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించనున్నారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులతో పాటు కొత్త వారికి కూడా మళ్లీ అవకాశం కల్పించనున్నారు. ఈ నెల 28 నుంచి జూలై 5 వరకు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని నిర్ణయించారు.

షెడ్యూల్‌పై అభ్యంతరాల వెల్లువ

ఇతర జిల్లాలకు చెందిన అనేక మంది ఉపాధ్యాయులు తమకున్న రాజకీయ, ఆర్థిక పరపతితో జిల్లాకు వచ్చి చేరారు. దీంతో ఉద్యోగాల్లోనే కాకుండా బదిలీలు, పదోన్నతుల్లోనూ స్థానికులకు అన్యాయం జరుగుతూనే ఉంది. అడ్డదారుల్లో వచ్చిన ఈ ఉపాధ్యాయులందరినీ తిరిగి వెనక్కి పంపాలని కోరుతూ గతంలో కొంతమంది ఉపాధ్యాయులు కోర్టును ఆశ్రయించారు. తుది తీర్పు ఇంకా రాలేదు. కానీ ప్రభుత్వం తాత్కాలికంగా స్టేను వెకెంట్ చేయించి, బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేసింది. ఇతర జిల్లాల్లో 20 రోజుల షెడ్యూల్ ఇవ్వగా, రంగారెడ్డి జిల్లాలో మాత్రం ఎనిమిది రోజులే ఇవ్వడంపై సర్వత్రా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఇతర జిల్లాల నుంచి వచ్చిన 400 మందికిపైగా ఉపాధ్యాయులను వెనక్కి పంపకుండా, బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపడుతుండటంతో స్థానికత అర్హత ఉన్న, సీనియార్టీ ఉన్న ఉపాధ్యాయులు మళ్లీ నష్టపోయే ప్రమాదం ఉందని ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. షెడ్యూల్ సమయాన్ని పెంచాలని డిమాండ్ చేస్తున్నాయి.

పారదర్శకంగా నిర్వహించాలి

తెలుగు మీడియం (ఎస్జీటీ కేడర్) ఇంగ్లిష్ సబ్జెక్టులో 42 మంది, ప్రైమరీ స్కూలు హెచ్ఎంలు 111 మంది, గణితం సబ్జెక్టులో 102 మంది, ఫిజికల్ సైన్స్‌లో 24, సోషల్ స్టడీస్‌లో 213 మంది, అదే విధంగా (ఎస్జీటీ ఉర్దూ మీడియం) బయాలజికల్ సైన్స్‌లో 8 మంది, గణితం (ఉర్దూ మీడియం)లో ముగ్గురు, ఫిజికల్ సైన్స్ (ఉర్దూ మీడియం)లో ముగ్గురు, సోషల్ (ఉర్దూ మీడియం)లో 15 మంది ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు లభించే అవకాశం ఉంది. వీరితో పాటు మరో మూడు వందల మంది ఉపాధ్యాయులకు హెచ్‌ఎంలుగా, ఇతర కేడర్లలో పదోన్నతులు లభించే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని సేవ్ రంగారెడ్డి ఉద్యమ సంస్థ కోర్ కమిటీ సభ్యుడు బొద్దు రవి డిమాండ్ చేశారు. వీలైతే షెడ్యూల్ తేదీని పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ ఏడీ నందసుభాషిణికి వినతి పత్రం అందజేశారు.

36,463

ధరణిలో ఉన్న పెండింగ్ దరఖాస్తులు

- స్పెషల్ డ్రైవ్‌లోనూ పరిష్కారం అంతంతే..
- గుట్టలుగా పేరుకుపోయిన అప్లికేషన్లు
- ఆందోళనలో భూ బాధితులు



ఓ బాధితుడి ఆత్మహత్యా యత్నం (ఫైల్)

సాక్షి, రంగారెడ్డిజిల్లా: భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి రైతుల పాలిట శాపంగా మారుతోంది. సకాలంలో సమస్య పరిష్కారం కాకపోగా, మరింత జఠిలంగా మారుతోంది. ఆపదలో భూమిని అమ్ముకోలేక, అవసరానికి బ్యాంకు లోన్లు ఇవ్వక రైతులు నష్టపోవాల్సి వస్తోంది. దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో కొంత మంది రైతులు ఆగ్రహంతో క్షేత్రస్థాయి అధికారులపై ప్రత్యక్ష దాడులకు పాల్పడుతుండగా, మరికొంతమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్న దాఖలాలు లేకపోలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఓటమి పాలవడం, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, ధరణి సమస్యల పరిష్కారం కోసం పలు దఫాల్లో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించడం తెలిసిందే. అయినప్పటికీ పోర్టల్‌లో పేరుకు పోయిన సమస్యలకు పరిష్కారమార్గం మాత్రం లభించక పోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఫలితమివ్వని స్పెషల్ డ్రైవ్

జిల్లాలో మొత్తం 40,242 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, ఈ నెల 15 నుంచి 28 వరకు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా 3,779 దరఖాస్తులను మాత్రమే పరిష్కరించారు. మరో 36,463 పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో 30,026 తహసీల్దార్ల వద్ద పెండింగ్‌లో ఉండగా, 5,024 ఆర్డీఓల వద్ద, 1,038 దరఖాస్తులు అదనపు కలెక్టర్ వద్ద, 375 కలెక్టర్ లాగిన్‌లో పెండింగ్‌లో ఉండటం గమనార్హం. వరుస ఎన్నికల కోడ్‌కు తోడు రెవెన్యూ అధికారుల బదిలీ, కొత్తగా వచ్చిన అధికారులు వీటి పరిష్కారానికి అంతగా ఆసక్తి చూపకపోవడంతో దరఖాస్తులు గుట్టలుగా పేరుకుపోయాయి. ధరణి పోర్టల్‌లో దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా..సమస్య పరిష్కారం కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అప్పుల చెల్లింపులకు, ఇతర అవసరాలకు ఆర్థిక వనరులు సమకూర్చుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇటీవల శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఓ రైతు ఆత్మహత్యకు యత్నించడం కొసమెరుపు.

ఇప్పుడైనా చొరవ చూపేనా?

ధరణి పోర్టల్‌లోని 33 రకాల మాడ్యుల్స్ ద్వారా వచ్చే దరఖాస్తులన్నీ నేరుగా కలెక్టర్ లాగిన్‌లోనే ఉండిపోయేవి. ఆయన వాటిని ఆమోదించడమో/ తిరస్కరించడమో చేసేవారు. ఆమోదించిన వాటికి క్షేత్రస్థాయి నివేదికల కోసం తహసీల్దార్లకు పంపేవారు. వారు ఆయా దరఖాస్తులకు సంబంధించిన పూర్వ రికార్డులన్నీ క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్ర స్థాయిలో విచారించి, తుది నివేదికను కలెక్టర్‌కు సమర్పించే వారు. ఆయన వాటికి ఆమోదం తెలిపేవారు. ఈ ప్రక్రియలో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటుండటంతో తాజాగా ప్రభుత్వం పోర్టల్‌లో పలు మార్పులు తీసుకొచ్చింది. ఇక మీదట దరఖాస్తు నేరుగా తహసీల్దార్ లాగిన్‌కు అటు నుంచి ఆర్డీఓకు, అటు నుంచి అదనపు కలెక్టర్‌కు, కలెక్టర్ లాగిన్‌లోకి చేరుతుంది. చిన్నచిన్న సమస్యలకు తహసీల్దార్ స్థాయిలోనే పరిష్కారం లభించనుంది. రెవెన్యూ అధికారులు వాటి పరిష్కారానికి ఇప్పటికైనా ఆశించిన స్థాయిలో చొరవ చూపుతారా? లేదా అనేది అనుమానమే.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ శశాంక, అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి

త్వరితగతిన పరిష్కరించాలి

ఇబ్రహీంపట్నం రూరల్: పెండింగ్‌లో ఉన్న వివిధ మాడ్యుల్స్ ధరణి సమస్యలను త్వరగతిన పరిష్కరించాలని కలెక్టర్ శశాంక రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పెండింగ్ ధరణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని శనివారం రాష్ట్ర భూపరిపాలన విభాగం ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో వీడియో కన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమీక్షకు జిల్లా అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డితో కలిసి కలెక్టర్ శశాంక హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ ధరణి సమస్యలను త్వరగతిన పరిశీలించి పరిష్కరించాలని ఆర్డీఓలు, తహసీల్దార్‌లకు సూచించారు. చేవెళ్ల, మొయినాబాద్, యాచారం , కందుకూరు, మంచాల, మహేశ్వరం మండలాల్లో ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వాటిని వీలైనంత త్వరగా పరిశీలించాలని చెప్పారు. ఇప్పటికే క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, ఏ ఒక్క దరఖాస్తు పెండింగ్‌లో లేకుండా అన్నింటినీ పరిష్కరిస్తామని అన్నారు. అపరిష్కృతంగా ఉన్న ధరణి దరఖాస్తులను ఆర్డీఓ, తహసీల్దార్ లాగిన్‌లో పెండింగ్‌లు ఉంటే పరిశీలించి క్లియర్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఫార్మా భూముల్లో మళ్లీ అలజడి

- భూసార పరీక్షల కోసమని యంత్రాల బిగింపు
- రైతుల ప్రతిఘటనతో వెనక్కి మళ్లిన అధికారులు



టీఎస్ఐఐసీ అధికారులతో వాగ్వాదానికి దిగిన కుర్మిద్ద రైతులు

యాచారం: ఫార్మా భూముల్లో మళ్లీ అలజడి మొదలైంది. ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో భూసార పరీక్షల కోసమంటూ శనివారం టీఎస్ఐఐసీ అధికారులు కుర్మిద్ద గ్రామం 311 సర్వే నంబరులోని భూముల్లో పెద్ద, పెద్ద యంత్రాలు దించి బిగిస్తున్నారు. కొంత మంది ఇంజినీరింగ్ సిబ్బందితో డేరాలు వేయిస్తున్నారు. సమీప రైతుల ద్వారా సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. టీఎస్ఐఐసీ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఇదే విషయాన్ని కొందరు ఫోన్ ద్వారా మాజీ ఎమ్మెల్యే ముదిరెడ్డి కోదండరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన వెంటనే టీఎస్ఐఐసీ ఉన్నతాధికారులతో మాట్లాడి సీరియస్ అయ్యారు. దీంతో అధికారులు యంత్రాలు తీసుకుని వెనక్కి వెళ్లిపోయారు. విషయం నానక్‌నగర్, తాడిపర్తి, నక్కర్తమేడిపల్లి గ్రామాల్లోని రైతులకు తెలియడంతో వారిలో కూడా ఆందోళన మొదలైంది. ఇదే విషయమై టీఎస్ఐఐసీకి చెందిన ఓ ఉన్నతాధికారితో 'సాక్షి' ఫోనులో మాట్లాడితే డ్యూటీలో భాగంగానే అధికారులు అక్కడికి వచ్చినట్లు తెలిపారు.

కార్మికుల జీవితాలకు మరణ శాసనం

ముక్కలవుతున్న వలస కార్మికుల రెక్కల కష్టం

- కుటుంబ సభ్యులకు ఇప్పటికీ అందని సమాచారం
- కనిపించని సౌత్ గ్లాస్ పరిశ్రమ యాజమాన్యం
- బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న మిగతా కార్మికులు



పరిశ్రమ ఆవరణలో బిక్కుబిక్కుమంటూ నిలుచున్న కార్మికులు

షాద్‌నగర్: రెక్కల కష్టాన్ని నమ్ముకొని పరాయి రాష్ట్రం నుంచి వచ్చి ప్రాణాలకు 'తెగి'ంచి పని చేస్తున్న కార్మికులు ఒక్కసారిగా ముక్కలు.. ముక్కలు అయ్యారు. శరీర భాగాలన్నీ ఛిదికిపోయి ఏరుకునే దారుణ పరిస్థితిలో ప్రాణాలు కోల్పోయారు. ఈ దారుణ మారణకాండకు పరోక్షంగా కారణమైన యాజమాన్యం కంటికి కనిపించకుండా పోయింది. ఇంత దారుణం జరిగినా ఇప్పటి వరకు కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం లేదు. ఇక్కడే పని చేసే మృతుల బంధువులున్నా అదే పరిస్థితి. జేబులో డబ్బులు లేక.. కడుపులో ఆకలిని చంపుకోలేక.. కనిపించని యాజమాన్యం కోసం ఎదురుచూస్తూ దీనంగా కాలం వెళ్లదీస్తున్నారు మిగతా కార్మికులు. షాద్‌నగర్ పరిధిలోని బూర్గుల గ్రామ శివారులో ఉన్న సౌత్ గ్లాస్ పరిశ్రమలో శుక్రవారం జరిగిన పేలుడు పెను విషాదాన్ని మిగిల్చింది.

కంటికి కనిపించని యాజమాన్యం

సౌత్ గ్లాస్‌పరిశ్రమలో ప్రమాదం జరిగిన విషయాన్ని బయటకు పొక్కనీయకుండా జాగ్రత్త పడ్డారు. ప్రమాదం జరిగిన రెండు గంటల తర్వాత విషయం బయటకు తెలిసింది. అప్పటికే మృతి చెందిన ఇద్దరిని షాద్‌నగర్‌కు తరలించారు. క్షతగాత్రులను వాహనాల్లో షాద్‌నగర్ పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. తర్వాత కంటికి కనిపించకుండా పోయారు.

అయ్యో పాపం..

కంటి ముందు ప్రమాదం జరిగి తమ వారు మృతి చెందినా పరిశ్రమ యాజమాన్యం కనీసం చివరి చూపు చూడనివ్వడం లేదని మృతుల కుటుంబ సభ్యులు వాపోయారు. పరిశ్రమలో ప్రమాదం జరిగిన వెంటనే విద్యుత్ సరఫరాను పూర్తిగా నిలిపివేశారు. పరిశ్రమ ఆవరణ నుంచి బయటికి వచ్చి పొరుగు రాష్ట్రంలో ఉన్న తమ వారికి ఫోన్ చేసి సమాచారం అందించాలన్నా సెల్‌ఫోన్‌లలో చార్జింగ్ లేని పరిస్థితి నెలకొందని మృతుల బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం వరకు కూడా మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందలేదని తెలిసింది.

కార్మికుల ఆకలి కేకలు

పరిశ్రమలో ప్రమాదం జరిగినప్పటి నుంచి అందులో ఉన్న మిగిలిన కార్మికులకు కనీసం తాగేందుకు నీరు, తినేందుకు భోజనం కరువైంది. పరిశ్రమలో ఘటన జరిగిన తర్వాత అధికారులు, నాయకులు వచ్చి పరిశీలించిన వెళ్లారు. తర్వాత కార్మికులను బయటకు వెళ్లనీయకుండా పరిశ్రమ గేట్లు మూసి వేశారు. ఓ వైపు తమ వారు, స్నేహితులు ఏమయ్యారోనని భయంతో, దిగులతో రాత్రంతా జాగారం చేశారు. చివరికి శనివారం ఉదయం స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించినప్పుడు అందులో ఉన్న కార్మికులు తన గోడు వెళ్లబోసుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే కార్మికులకు భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు.

ఒత్తిడి ఎక్కువై పేలుడు

వాహనాలకు సంబంధించిన గ్లాస్‌లను సౌత్ గ్లాస్ పరిశ్రమలో తయారు చేస్తున్నారు. పరిశ్రమలోని ఆటో క్లేవ్ యూనిట్‌లో గ్లాస్ తయారైన తర్వాత సాధారణంగా కంప్రెషర్‌పైన ఉండే కీహోల్ దానంతట అదే తెరుచుకుంటుంది. కానీ ఇక్కడ కీహోల్ తెరుచుకోకపోవడంతో ఆటోక్లేవ్ యూనిట్‌లో గ్యాస్, వేడి తీవ్రత పెరిగి ఒత్తిడి ఎక్కువై పేలుడు సంభవించింది. పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులు ఎలాంటి రక్షణ కవచాలను యాజమాన్యం అందించలేదని తెలుస్తోంది. ఈ పేలుడు ఘటనలో ఐదుగురు కార్మికులు అక్కడికక్కడే మృత్యువాత పడగా మరో 13 మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు.

ప్రమాదాలు నిత్యకృత్యం

పారిశ్రామిక ప్రాంతం అయిన షాద్‌నగర్‌లో పరిశ్రమల్లో ప్రమాదాలు నిత్యకృత్యం అయ్యాయి. తరచూ ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. 2012లో షాద్‌నగర్ శివారులోని స్టీమ్ కోర్ పరిశ్రమలో బాయిలర్ పేలి 12 మంది కార్మికులు మృతి చెందారు. 2015లో కొత్తూరు వినాయక స్టీల్ పరిశ్రమలో ఫర్నస్ పేలి పది మంది మృత్యువాత పడ్డారు. తీగాపూర్ శివారులోని పాత టైర్లను కాల్చే పరిశ్రమలో ప్రమాదం బాయిలర్ పేలి నలుగురు, నందిగామ పరిధిలోని శివశక్తి, జాగృతి, షాద్‌నగర్ పరిధిలోని ఎలికట్ట, మొగిలిగిద్ద శివారులో ఉన్న స్పాంజ్ ఐరన్ పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల్లో పదిమందికి పైగా కార్మికులు మృత్యువాత పడటంతో పాటుగా ఎంతో మంది గాయాలపాలయ్యారు. గత సంవత్సరం జూలైలో కాశిరెడ్డిగూడ గ్రామ శివారులో ఉన్న బ్లెండ్ కలర్ పరిశ్రమలో నలుగురు కార్మికులు మృత్యువాత పడ్డారు. అక్కడక్కడ చిన్న చిన్న పరిశ్రమల్లోనూ ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి.

మృతదేహం చూపించలేదు



పరిశ్రమలో నాతో పాటు సోదరుడు నిఖిత్ పని చేస్తున్నాడు. పరిశ్రమలో పేలుడు జరగడంతో నిఖిత్ మృతి చెందాడు. యజమానులు కనీసం శవాన్ని కూడా చూపించలేదు. ఫోన్ చేసి కుటుంబ సభ్యులకు చెబుదామన్నా చార్జింగ్ లేదు.

– సునీల్, కార్మికుడు, సౌత్ గ్లాస్ పరిశ్రమ

బయటికి రాకుండా గేట్లు



పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో తమ్ముడు రాంమోరిస్ చనిపోయాడు. శవం ఎక్కడుందో తెలియదు. ప్రమాదం జరిగినప్పటి నుంచి నీళ్లు, తిండి లేదు. రాత్రంతా చీకట్లో ఉపవాసంతో గడిపాం. పరిశ్రమ నుంచి బయటకు వెళ్లనీయకుండా గేట్లు మూసి వేశారు.

– వికాస్, కార్మికుడు, సౌత్ గ్లాస్ పరిశ్రమ

యాజమాన్యం ఆదుకోవాలి



పరిశ్రమలో పేలుడు జరిగినప్పటి నుంచి భయానక వాతావరణం చోటు చేసుకుంది. పరిశ్రమలో ఎక్కడ చూసినా రక్తం మరకలు, శరీర అవయవాలు కనిపిస్తున్నాయి. యజమానులు పత్తాలేరు. పొట్టకూటి కోసం వచ్చిన మమ్మల్ని ఆదుకోవాలి. అధికారులు న్యాయం చేయాలి.

– సుభాష్, కార్మికుడు, సౌత్ గ్లాస్ పరిశ్రమ

విద్యుదాఘాతంతో ఆవు మృతి


ఆవు కళేబరం వద్ద రైతు

కొందుర్గు: విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి చెందింది. ఈ ఘటన శనివారం మండల పరిధిలోని చెక్కలోనిగూడలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన నలమోని ఆంజనేయులు తన ఆవును మేపుతుండగా సాయంత్రం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృత్యువాత పడింది. ఆవు విలువ సుమారు రూ.95వేలు ఉంటుందని.. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని బాధిత రైతు వాపోయాడు.

‘ఆయిల్ పామ్’తో లాభాలు అధికం


మాట్లాడుతున్న డాక్టర్ బీఎన్ రావు

- డాక్టర్ బీఎన్ రావు

షాద్‌నగర్‌రూరల్: ఆయిల్ పామ్ సాగు చేసే రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు గడించవచ్చునని ఆయిల్‌పామ్ రాష్ట్ర సలహాదారుడు డాక్టర్ బీఎన్ రావు అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మధురాపూర్ పంచాయతీ కార్యాలయంలో డివిజన్ హెచ్‌ఓ ఆయిల్ పామ్ సాగుపై అవగాహనచ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీఎన్ రావు మాట్లాడుతూ.. దేశ అవసరాలకు సరిపడా ఆయిల్ ఉత్పత్తి చేయాలంటే రైతులు ఎక్కువ మొత్తంలో పంట సాగు చేయాలన్నారు. రైతులు యాజమాన్య పద్ధతులు, మెలకువలను పాటిస్తే ఎకరాకు పది నుంచి 15 టన్నుల వరకు దిగుబడి వస్తుందన్నారు. ఈ పంటను కంపెనీ వారే కొనుగోలు చేస్తారన్నారు. ఇతర పంటలతో పోల్చితే చీడపీడల బెడద, కూలీల అవసరం తక్కువగా ఉంటుందన్నారు.

వందశాతం సబ్సిడీ

హార్టికల్చర్ జిల్లా ఏడీ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగుతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. మొక్కలపై 90 శాతం, డిప్పుపై ఐదెకరాలలోపు ఉన్న బీసీ, ఓసీ రైతులను 90శాతం, ఐదు నుంచి 12 ఎకరాలున్న రైతులకు 80శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం సబ్సిడీ ఉంటుందన్నారు. ప్రతీ ఏడాది ఎకరాకు రూ.4,200 చొప్పున నాలుగేళ్ల పాటు మెయింటనెన్స్ అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ భార్గవ్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శివారెడ్డి, ఆయిల్ పామ్ కంపెనీ ఉపాధ్యక్షుడు రామ్మోహన్, జిల్లా ఏరియా మేనేజర్ ప్రమోద్, ఫీల్డ్ ఆఫీసర్ మల్లారెడ్డి, ఏఈఓ ప్రియాంక, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చేవెళ్ల: రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొనడంతో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. పామెన గ్రామానికి చెందిన బర్కని కృష్ణ తన టీవీఎస్ ఎక్సెల్‌పై అదే గ్రామానికి చెందిన మంచనపల్లి బాలయ్య(65) ఈ నెల 27న చేవెళ్ల నుంచి గ్రామానికి వెళ్తూ దుర్గాభవాని వైన్స్ వద్ద యూటర్న్ తీసుకుంటున్నారు. అదే సమయంలో షాబాద్ నుంచి చేవెళ్ల కు ప్రయాణిస్తున్న యూనికార్న్ బైక్ వేగంగా టీవీఎస్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎక్సెల్‌పై ఉన్న ఇద్దరూ తీవ్రంగా గాయపడడంతో స్థానికులు చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స తర్వాత వారిని మెరుగైన చికిత్స కోసం నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. బాలయ్య పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యు లు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు ప్రారంభించారు.

ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేస్తుండగా..

- విద్యుదాఘాతంతో రైతుకు తీవ్రగాయాలు


చికిత్స పొందుతున్న సాయికుమార్

కేశంపేట: ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేస్తున్న యువకుడు విద్యుదాఘాతంతో గాయపడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని బోధునంపల్లి శివారులో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు క్యామ సాయికుమార్ వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన వ్యవసాయ క్షేత్రానికి సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కారణంగా రెండు రోజులుగా బోరు మోటార్లకు విద్యుత్ సరఫరా అవ్వడం లేదు. ఇదే విషయమై లైన్‌మెన్ జంగయ్యకు సమాచారం ఇచ్చిన స్పందించ లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఫోన్లో సంప్రదిస్తే చౌలపల్లి ఫీడర్ పరిధిలో ఎస్‌సీ ఉందని.. సమస్యను పరిష్కరించుకోండని సూచించాడు. దీంతో సాయికుమార్ మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ సరఫరా అవ్వడంతో విద్యుత్‌షాక్ తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు ఆయన్ను షాద్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఇదే విషయమై ఏఈ ఈశ్వర్‌ను సంప్రదించగా సబ్‌స్టేషన్ నుంచి ఎల్‌సీ ఇవ్వలేదని.. ఏమైనా రిపేర్లు ఉంటే విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇస్తే సమస్య పరిష్కరిస్తారన్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

రుణమాఫీకి ఆంక్షలుండొద్దు

- మాజీ ఎమ్మెల్యేలు బాలరాజు, రాజేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి


మాజీ ఎమ్మెల్యేలు బాలరాజు, రాజేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, రాజేందర్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మిషన్ భగీరథ వైస్ చైర్మన్, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీకి ఎలాంటి ఆంక్షలు విధించవద్దని అన్నారు. హైదరాబాద్‌లోని వెంకటేశ్ నివాసంలో శనివారం మాజీ ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం స్థానిక నాయకులతో సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికలు, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చలు సాగాయి. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, బీఆర్ఎస్ నాయకులు కొమ్ము శ్రీనివాస్‌యాదవ్, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

‘నకిలీ’లలు

- తహసీల్దార్ కార్యాలయంలో అనర్హులకు సర్టిఫికెట్లు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన తహసీల్దార్


మంచాల తహసీల్దార్ కార్యాలయం

మంచాల: నకిలీ సర్టిఫికెట్లకు మంచాల తహసీల్దార్ కార్యాలయం కేరాఫ్ అడ్రస్‌గా మారింది. గతంలోనూ ఇక్కడ ఎన్నో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. తాజాగా అనర్హులకు సర్టిఫికెట్‌లు జారీ చేస్తూ మరోసారి వార్తల్లోకెక్కింది. వివరాలిలా ఉన్నాయి. మంచాల తహసీల్దార్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ కంప్యూటర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అక్రమార్జనకు అలవాటు పడిన ఆయన మంచాల తహసీల్దార్ కార్యాలయంలో స్థానికేతరులకు నకిలీ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నాడు. ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.వెయ్యి నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నాడంటూ వదంతులు వస్తున్నాయి. ఈ విషయం బయటకు పొక్కడంతో తహసీల్దార్ వెంకటప్రసాద్ గమనించి విచారణ చేశారు. శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సురేశ్‌తో పాటుగా ఆయనకు సహకరించిన రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవినాయక్ తెలిపారు. సోమవారం పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

ఘనంగా సహజ యోగా మహోత్సవం



సహజ యోగా మహోత్సవాన్ని ప్రారంభిస్తున్న సోనాలి భట్టాచార్య

హుడాకాంప్లెక్స్: యోగతో సంపూర్ణ ఎదుగుదల సాధ్యమని సహజ యోగ నేషనల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ సోనాలి భట్టాచార్య, సహజ యోగ రాష్ట్ర కోఆర్డినేటర్ గౌరీ కృష్ణ అన్నారు. శనివారం హైదరాబాద్ రియలైజేషన్ టూర్ పేరుతో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో సహజ యోగ మహోత్సవం నిర్వహించారు. సోనాలి భట్టాచార్య ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగ వ్యక్తిగత జీవనశక్తిని విశ్వంతో అనుసంధానం చేయడానికి ఉపయోగపడే సాధనమన్నారు. ఆందోళన, అభద్రతాభావం, కుంగుబాటులు లాంటి సమస్యలు యోగతో పరిష్కరించుకుని సంపూర్ణ జీవితాన్ని గడుపుతున్నారని తెలిపారు. యోగ మనందరి దైనందిన జీవితంలో ఒక భాగం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జబర్దస్త్ ఫేమ్ నటులు, మాజీ కోఆర్డినేటర్లు మల్లారెడ్డి, రామ్మోహన్ రావు, సుబ్బిరెడ్డి, కమిటీ సభ్యులు సుప్రజ, వినోద్, ప్రమోద్, సునీల్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా రిజిస్ట్రేషన్

తహసీల్దార్, వీఆర్‌ఓలపై కేసు

శంకర్‌పల్లి: అక్రమంగా భూమి రిజిస్ట్రేషన్ చేయడంతో ఓ తహసీల్దార్, వీఆర్‌ఓపై కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. బాలాపూర్ మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన కడారి అంజయ్య 2022లో శంకర్‌పల్లి మండలం దొంతాన్‌పల్లి సర్వే నంబర్ 151లో 22 గుంటల భూమిని రాములమ్మ, శ్రీకాంత్ యాదవ్ నుంచి జీపీఏ చేసుకున్నాడు. ఈ భూమిని 2005 సెప్టెంబర్ 24న రికార్డులు మార్చి అప్పటి తహసీల్దార్ బి.మోహన్‌రావు, వీఆర్‌ఓలు ఎలాంటి పత్రాలు, ఆధారాలు లేకుండా వేరే గ్రామానికి చెందిన ఫైల్ నంబర్ బి/2500/2005 పై జంగంపేట మాణిక్‌రెడ్డి కొనుగోలు చేసినట్లుగా మ్యుటేషన్ చేశారు. రాములమ్మ, శ్రీకాంత్ 2016లో విషయం తెలుసుకుని చేవెళ్ల కోర్టులో కేసులు వేశారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో 2022 డిసెంబర్ 29న కడారి అంజయ్యకు జీపీఏ చేశారు. అనంతరం అంజయ్య ఆర్టీఐ కింద భూమికి సంబంధించిన పత్రాలు సేకరించి, హైకోర్టులో కేసు వేసి, శంకర్‌పల్లి ఠాణాలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. 2024 మే1న లోకాయుక్తలో కేసు ఫైల్ చేయగా..తహసీల్దార్ బి.మోహన్‌రావు, వీఆర్‌ఓ, అక్రమ కొనుగోలు చేసిన జంగంపేట మాణిక్‌రెడ్డిలపై కేసు నమోదు చేయాలని సైబరాబాద్ సీపీ, శంకర్‌పల్లి ఎస్‌హెచ్‌ఓలకు లోకాయుక్త జూన్ 28న ఆదేశించింది. లోకాయుక్త ఆదేశాల మేరకు వారి ముగ్గురిపై 420, 465, 468, 471 కింద కేసు నమోదు చేశామని తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని శంకర్‌పల్లి సీఐ హబీబుల్లాఖాన్ తెలిపారు.

హత్యకు దారి తీసిన వివాహేతర సంబంధం


అనిల్ (ఫైల్)

జగద్గిరిగుట్ట: వివాహేతర సంబంధం ఓ వ్యక్తి దారుణ హత్యకు దారి తీసిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులుమేరకు.. మెదక్ జిల్లా ముప్పారం గ్రామానికి చెందిన గాజుల అనిల్ (40) జగద్గిరిగుట్ట వెంకటేశ్వర నగర్‌లో ఉంటూ అంబులెన్స్ సర్వీసులు నిర్వహిస్తుంటాడు. ఇతనికి భార్య భాగ్యలక్ష్మి, ఓ కూతురు, కుమారుడు ఉన్నారు. భాగ్యలక్ష్మి టిఫిన్ సెంటర్ నడుపుతోంది. ఆదే టిఫిన్ సెంటర్‌లో పనిచేస్తున్న కృష్ణవేణితో అనిల్ కొంతకాలంగా సహజీవనం చేస్తున్నాడు. కొద్దిరోజులుగా భాగ్యలక్ష్మి ప్రవర్తనలో మార్పు కనిపిస్తుందని అనిల్ తన స్నేహితులతో చెప్పేవాడని తెలిసింది. టిఫిన్ సెంటర్‌లో పనిచేసే మల్లేష్‌తో చనువుగా ఉంటున్నట్లు బాధపడేవారని, ఇదే విషయమై భాగ్యలక్ష్మితో శుక్రవారం అర్ధరాత్రి ఘర్షణ చోటుచేసుకుంది. శనివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో అంబులెన్స్ డ్రైవర్ నవీన్ ఫోన్ చేసి అనిల్ రక్తపు గాయాలతో పడి ఉన్నాడని, మల్లారెడ్డి ఆసుపత్రికి రమ్మని తన తోటి డ్రైవర్ సురేష్‌కి ఫోన్ చేసాడు. ఆసుపత్రికి వెళ్లి చూడగా అతని ఛాతీపై పదునైన కత్తితో పొడిచి, గొంతు కోసిన ఆనవాళ్ల ఉండడంతో అనుమానం వచ్చి అక్కడే ఉన్న భాగ్యలక్ష్మి, మల్లేష్‌ను ఆరా తీయగా పొంతన లేని సమాధానాలు చెప్పారు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు సురేష్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. భాగ్యలక్ష్మి, మల్లేష్ కృష్ణవేణిలను, ఇంకా మరి కొంత మంది అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. సంఘటనాస్థలాన్ని ఏసీపీ హనుంతరావు, సీఐ క్రాంతి కుమార్ పరిశీలించారు.

చర్లపల్లి జైలులో అదాలత్

కుషాయిగూడ: చర్లపల్లి కేంద్ర కారాగారంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జైల్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా 38 మంది ఖైదీలకు సంబంధించి 33 కేసులను పరిష్కరించారు. ఖైదీలకు సత్వర న్యాయసాయం అందించేందుకు ఏర్పాటు చేస్తున్న జైల్ అదాలత్ ఖైదీలకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ అదాలత్‌లో న్యాయమూర్తులు బి. ఉషాక్రాంతి, గోపిక నాగ శ్రావ్య న్యాయసాయం అందజేయగా జైల్ పర్యవేక్షణాధికారి సంతోష్‌కుమార్ రాయ్, డిప్యూటీ పర్యవేక్షణాధికారులు శశికాంత్, కాళిదాసు, సిబ్బంది రత్నం, పరుశరాం, సత్తయ్య, సాయి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు టీ హబ్‌లో సదస్సు

హిమాయత్‌నగర్: సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ‘సోషియా వుడ్ 2024 సమ్మిట్’ ఆదివారం నగరంలో నిర్వహించనున్నట్లు ఎండ్ నౌ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు అనిల్ రచమల్ల తెలిపారు. శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో డాక్టర్ విజయ్ భాస్కర్‌తో కలసి కార్యక్రమ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. టీ హబ్ మార్వెల్ 5వ అంతస్తులోఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఐటీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ హాజరవుతారన్నారు.